# ఓ శ్రీమతి విచారం



మహిళలకు సంబంధించిన ఒక చిన్న జోకూ, ఒక పెద్ద జోకూ ఇప్పుడు చెప్తాను,

ఒకావిడ ఒక సాయంకాలం మినపరొట్టె కాల్చిందట. సరే ఇంట్లో అంతా రొట్టె ఆరగించారు. కొంత రొట్టె మిగిలిపోయింది. మర్నాడు ఉదయం కూతుర్ని పిలిచి 'అమ్మలూ ఈ రొట్టె కుక్కకు పెట్టవే'అందట. కూతురు రొట్టెముక్కను కుక్క దగ్గర పెడితే అది ముట్టుకోలేదు. "అమ్మా కుక్క తినడంలేదే" అని కూతురు అరిచింది. "అయితే నాన్నకు పెట్టెయ్యవే" అందట ఆ మహా ఇల్లాలు.

రెండో జోకు. ఆమె కులీనురాలు. ఉదయం నుంచి ఆమె మనసు ఎంతగానో బాధపడుతున్నది. వార్తాపత్రిక చదువుతుంటే చేతులు వణికాయి. ఆమె కుక్కపిల్ల ఆ రోజు ఉదయం తప్పిపోయింది. ఆవిడకు పిచ్చెక్కినంత పనయింది. వెంటనే ఓ సుప్రసిద్ధ తెలుగు దినపత్రికలో ప్రకటన చేసింది. 'తప్పిపోయింది తెల్లటి కుక్కపిల్ల జనతా అని పిలిస్తే ఊ కొడ్తుంది. తీసుకొచ్చి ఎవరైనా అప్పగిస్తే రెండువందలు బహుమతి.

మర్నాడు ఉదయమంతా వీధిలోకి చూస్తూ కాలం గడిపింది. ఎవరైనా కుక్కపిల్లను తీసుకొచ్చి అప్పగిస్తారేమోనని ఆమె ఆశ. సాయంకాలం ఆరైంది. ఆ సుప్రసిద్ధ దినపత్రికకు ఇక చందా కట్టగూడదని నిశ్చయించుకుంది.

కుక్కపిల్ల జాడ తెలియలేదు. ఇక లాభంలేదని నగరంలో వున్న మిగతా దినపత్రికలన్నిటిలో ప్రకటన చేసిందామె. ఈసారి బహుమతి నాలుగు వందల వరకూ పెరిగింది. నాలుగు రోజులు గడిచాయ్. జనత రాలేదు. శ్రీమతీజీకి ఇంకేమీ పాలుపోలేదు. డిటెక్టివ్ కోసం కబురుచేసింది. అతను వచ్చాడు. "నా జనతా తప్పిపోయింది. నన్ను ఒంటరిగా చేసి వెళ్ళిపోయింది. మీరు ఎట్లాగైనా దాన్ని పట్టుకోవాలి. రేపు సాయంకాలానికి మీరు దాన్ని పట్టుకుంటే ఎనిమిది వందల బహుమతి. నా జనతా నాకు కావాలి" అని వెక్కివెక్కి రోదించసాగింది.

డిటెక్టివ్ ఇరవై నిముషాల వరకూ మాట్లాడలేకపోయాడు.

"అమ్మా కుక్కపిల్ల ఎప్పుడు తప్పిపోయిందో చెప్పగలరా?"

"మా ఆయన"

మీ కుక్కపిల్ల సంగతి చెప్పండి ముందు.

"మా ఆయన కుక్కపిల్లా వారంరోజుల క్రితం ఒక సాయంకాలం షికారుకెళ్ళారు. ఇద్దరూ ఇంతవరకూ ఇల్లు చేరుకోలేదు".

ఆమె క్షణంసేపు ఆగి నా కుక్కపిల్లను నా జనతాను నాకు చూపించరూ" అని మళ్ళీ ఏడవడం మొదలుపెట్టింది.



గోపాలశాస్త్రి